నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం 26 మే 2023

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, గుర్తుతెలియని వారి నుంచి జాగ్రత్తగా ఉండాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ సూచించారు. గురువారం ఉదయం మండలంలోని కూచారం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్డెన్ సెర్చ్‌లో ఎలాంటి ధృవ పత్రాలు లేని 45 బైకులు, 7 ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వారు ఫోన్‌లో అనుకోకుండా డబ్బులు పడ్డాయని ఓటీపీ చెప్పాలంటూ నమ్మించే ప్రయత్నాలు చేస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని సూచించారు. చిన్న పిల్లలకు వాహనాలను ఇస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే నేరమే అని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌ను కలిగి ఉండాలని తెలిపారు. గ్రామంలో గుర్తు తెలియని వారి నుండి రక్షణ కోసం తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ సర్కిల్ నుండి ముగ్గురు ఎస్‌ఐలు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు డి నరేష్‌ముదిరాజ్‌తో పాటు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్రకీలకం

పీఐబీ మీడియా వర్క్‌షాప్‌లో అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



ప్రజలకు సరైన సమాచారాన్ని చేరవేయడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి జర్నలిస్టులు సానుకూల సందేశాలను ప్రచారం చేసి వాటి నుంచి ప్రజలు ప్రయోజనం పొందేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం సిద్దిపేటలో ప్రభుత్వ పథకాలు, విధానాలపై మీడియా అవగాహన పెంపొందించే ఔట్ రీచ్ యాక్టివిటీ ప్రోగ్రాంలో భాగంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో సిద్దిపేటలో ఒకరోజు మీడియా వర్క్‌షాప్ 'వార్తాలాప్'ను ఆయన పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్, పిఐబి జాయింట్ డైరెక్టర్ వి.బాలకృష్ణలతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు వార్తల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ జిల్లాల్లోని జర్నలిస్టులు భారత ప్రభుత్వ తాజా విధానాలు, కార్యక్రమాల గురించి తెలుసుకునేందుకు వీలుగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించిందని తెలిపారు. అభివృద్ధి వార్తలను విస్తృతం చేయడంలో మీడియా సానుకూల పాత్ర పోషిస్తుందని, పౌరులకు చేరువ కావడంలో సిద్దిపేట జిల్లా మీడియా సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ డా.ఎస్. రాము, ఫాక్ట్ చెక్ ట్రైనర్, సత్య ప్రియలతో జర్నలిజంలో ఉత్తమ పద్ధతులు, వాస్తవ తనిఖీ యంత్రాంగంతో నకిలీ వార్తలను ఎదుర్కోవడం కు సంబంధించిన అంశాలపై రెండు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. కాగా సిద్దిపేటతో పాటు చుట్టుపక్కల పట్టణాల నుంచి 100 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

స్కూళ్ల అభివృద్ధికి పీఎంశ్రీ

- ఒక్కో స్కూల్‌కు రూ.2 కోట్లు
- ఐదేళ్లల్లో పనులు పూర్తికి ప్లాన్
- సంగారెడ్డి జిల్లాలో 25 స్కూళ్ల ఎంపిక

ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద ప్రభుత్వ స్కూళ్లను అభివృద్ధి చేయనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 25 పాఠశాలలను ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల జాబితాలను ఇటీవలే విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పీఎంశ్రీ పేరుతో ఈ పథకాన్ని అమలు చేయబోతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపికైన పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులు చేపడతారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ఉంచేందుకు మన ఊరు-మన బడి పేరుతో అభివృద్ధి చేస్తుంది. కేంద్రం నుంచి కూడా కొన్ని పాఠశాలను అభివృద్ధి చేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత ఉన్నతంగా రూపుదిద్దుకోనున్నాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలు ఉండేలా అభివృద్ధి పర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. పీఎంశ్రీ పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్లు కేటాయించనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున నిధులు కేటాయిస్తారు. రూ.2 కోట్లు ఐదు సంవత్సరాల్లో ఖర్చు చేయాలి. ఏటా రూ.40 లక్షల నిధుల్ని కేటాయిస్తారు. ఈ నిధులతో పనులు చేసిన తర్వాత వచ్చే ఏడాదికి నిధులు ఇస్తారు. పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం, వసతుల కల్పన, ఇతర సౌకర్యాలు, డిజిటల్ లైబ్రరీ, ఎల్ఈడీ లైట్లు, పర్యావరణ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవనరులతో పాటు వృత్తివిద్య కోర్సులు, నైపుణాభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోనున్నారు.



సంగారెడ్డి జిల్లాలో 25 స్కూళ్ల ఎంపిక

పీఎంశ్రీ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సంగారెడ్డి జిల్లాలో 25 పాఠశాలను ఎంపిక చేశారు. న్యాల్‌కల్ మండలంలోని కేజీబీవీ, పటాన్‌చెరు మండలంలో ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్, కొండాపూర్ మండలంలోని తొగర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్, నాగిలిగిద్ద మండలంలోని మోర్గి తెలంగాణ మోడల్ స్కూల్, పుల్కల్ మండలంలోని సింగూర్ సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట జెడ్పీహెచ్ఎస్, తెల్లాపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్, వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడ టీఎస్ఎంఎస్, సదాశివపేట మండలంలోని నందికంది జెడ్పీహెచ్ఎస్, అందోల్ మండలంలోని తాడ్మనూర్ ఎంపీపీఎస్, సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, హత్నూర మండంలోని దౌల్తాబాద్ జెడ్పీహెచ్ఎస్, జిన్నారం మండంలోని టీడబ్ల్యూఆర్ఈఐఎస్, కంది మండలంలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, కోహీర్ మండలంలోని దిగ్వాల్ టీఎస్ఆర్ఈఐఎస్, మనూరు మండలంలోని మాయికోడ్ ఎంపీయూపీఎస్, మునిపల్లి మండలంలోని లింగంపల్లి టీఎస్ఆర్ఈఐఎస్, నారాయణఖేడ్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్, రాయికోడ్ మండంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌జి, సిర్గాపూర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్, జహీరాబాద్ మండలంలోని షేకాపూర్ జెడ్పీహెచ్ఎస్, టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జి, బొల్లారం జెడ్పీహెచ్ఎస్, గుమ్మడిదల జెడ్పీహెచ్ఎస్, ఝరాసంగం టీఎస్ఎంఎస్ పాఠశాలలను ఎంపిక చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయి

ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మన ఊరు-మన బడి పథకం కింది అన్ని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు దశల వారిగా నిధులు కేటాయిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద ఐదేళ్లకు కలిపి ఒక్కో పాఠశాలకు రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేసేందుకు పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

- వెంకటేశ్వర్లు, డీఈఓ

మనువాదంపై అంబేద్కర్ ఉక్కు పిడికిలి

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-నారాయణఖేడ్

అంబేద్కర్ కొందరివాడు కాదు.. అందరి వాడు అని, కుల నిర్మూలన, మనువాదంపై ఉక్కు పిడికిలి బిగించిన పోరాట యోధుడని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు. గురువారం రాత్రి నారాయణఖేడ్ సెట్కార్ ఫంక్షన్ హాల్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర లక్ష్యాలు, ఆశయాలపై సంఘం శరణం గచ్చామి అభ్యుదయ ఆర్ట్ కళా మండలి హైదరాబాద్ వారు అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో అద్భుతమైన నాటక ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు అతిమేల మాణిక్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అని, వారి ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఆయన జీవితం.. అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో నెలకొన్న అంటరానితనం, కుల వివక్ష, మనువాదంపై అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగించాల న్నారు. రాజ్యాంగ రక్షణ తోనే దేశం ఐక్యంగా ఉంటుందన్నారు. రాజ్యాంగంపై దాడిని తిప్పికొట్టాలన్నారు.

ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

బాబాసాహెబ్ అంబేద్కర్ విద్యార్థి జీవితం, నాటి తాను ఎదుర్కొన్న కుల వివక్ష, అంటరానితనం.. వాటిని ప్రతిఘటించి పట్టుదలతో ఆయన ముందుకు సాగడం, లండన్‌లో చదువుతున్నప్పటి పరిస్థితులు, అంబేద్కర్ కుమారుడు గంగాధర్ జ్వరంతో బాధపడుతుంటే హాస్పిటల్ తీసుకుపోలేని పరిస్థితి.. కనీసం మందులు కొనలేక మృతి చెందిన ఘటన దశ్యం ప్రేక్షకులను కన్నీటిపర్యంతం చేశాయి. మొత్తంగా ఆయన జీవిత చరిత్రపై చేసిన నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అభ్యుదయ ఆర్ట్ కళామండలి బందం నాయకులు జగ్గ రాజు మాట్లాడుతూ.. మహనీయులు బాబా సాహెబ్ అంబేద్కర్ అందరివాడు చూపెట్టడం రాజ్యాంగం ద్వారా అట్టడుగు వర్గాల ప్రజలకు అందించిన అనేక హక్కులను వారి జీవితాన్ని ప్రజలకు తెలియజేయడమే సంఘం శరణం గచ్చామి కళారూపక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే వేమన, గౌతమ్ బుద్ధుడు వంటి మహనీయుల జీవిత చరిత్రలపై కూడా ప్రదర్శనలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు, సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి చిరంజీవి, అంబేద్కర్ వాది గాజులపాడు సంతోష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కాన్సిరాం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాశీనాథ్ జాదవ్, పగిడిపల్లి సర్పంచ్ ప్రసాద్, అంత్వార్ సర్పంచ్ కుమారుడు సల్మాన్ రాజ్, వివిధ సామాజిక ప్రజాసంఘాల నాయకులు గణపతి, అరుణ్, సంజీవ్, రాజ్‌కుమార్, శంకర్, రాము, ప్రవీణ్ ప్రశాంత్, బాబురావు, ఎల్లయ్య, యాదమ్మ, ప్రశాంతి, ఆర్తి తదితరులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ వీవోఏల నిరసన

నవ తెలంగాణ-దౌల్తాబాద్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం వీవోఏలు భిక్షాట చేస్తూ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి శివాజీ లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన వీధుల్లో మండల మహిళా సమాఖ్య వీవోఏలు భిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు సంద యాదగిరి మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలు అందించడంతో పాటు ఉద్యోగ భద్రత, ఆరోగ్యబీమా, ప్రమాదబీమా రూ.10 లక్షలు ఇవ్వాల్నారు. అర్హత గల వీవోఏలకు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. ఐడీ కార్డ్స్ ఇవ్వాలన్నారు. వీవోఏలు కవిత, అనిత, రజిత, నవణిత, సంగీత, శివలక్ష్మి, బాల్ రెడ్డి, మహేందర్, సురేందర్, భిక్షపతి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

తమ సమస్యలను పరిష్కరించి కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి రెండో రోజు చేరుకుంది. సీఐటీయూ శ్రామిక్ మహిళా కన్వీనర్ దాసరి కళావతి హాజరై వీవోఏల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని వీవోఏలు హెచ్చరించారు. వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దాసరి కళావతి అన్నారు. అధికారులు వీవోఏలతో వ్యక్తిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వడంలో విఫలమయ్యారన్నారు. వీవోఏల అన్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అధికార యంత్రాంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. శాంతియుతంగా జరుగుతున్న సమ్మెకు ఆటంకం కలిగించాలని చూస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, వీఓఏల జిల్లా నాయకులు కిష్టయ్య, రాజు, చంద్రకళ, లావణ్య, సుష్మా, లక్ష్మయ్య, వంశీ, మాధురి ,హారిక, రైసా బేగం, బాలమణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలపై రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ



నవ తెలంగాణ మిరు దొడ్డి

వీవోఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ఆ సంఘం మండల అధ్యక్షురాలు యమున అన్నారు. మహిళా సంఘాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వీవోఏలకు కనీస వేతనం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. 33 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వానికి వీవోఏలు విన్నవించినా పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే వీఓఏలకు రూ.26 వేల కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివోఏలు సత్తిరెడ్డి స్వప్న, జమున, మంగమ్మ కనకయ్య పలువురు పాల్గొన్నారు.





వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు రైతుల ధర్నా

నవ తెలంగాణ మిరుదొడ్డి



వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు రైతులు ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు జరిగినప్పటికీ లారీలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట గురువారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం విక్రయించినప్పటికీ లారీలు రాకపోవడంతో రోజుల తరబడి యార్డులో పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులకు గురయ్యామని, ఇప్పుడు ధాన్యం విక్రయించి కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ధాన్యం సంచులు యార్డులో పేరుకుపోయాయని, అయినప్పటికీ లారీల కొరత వల్ల ధాన్యం యార్డులోనే ఉండిపోయిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి లారీలను కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే లారీల కొరత ఏర్పడుతుందని రైతులు ఆరోపించారు. సంబంధిత అధికారులకు వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులకు నచ్చజెప్పి లారీలు వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో అన్నదాతలు ఆందోళనను విరమించుకున్నారు.

కార్పొరేట్ల ఆస్తులు పెంచిన మోడీ

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మోడీ పాలనలో కార్పొరేట్ల ఆస్తులు పెరిగాయి తప్ప పేదల ఆదాయం పెరగలేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ అన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'బీజేపీ కార్పొరేట్ విధానాలు, మతోన్మాదం-కార్మిక వర్గంపై ప్రభావం' అనే అంశంపై కేకే భవన్‌లో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. నల్లధనం తెస్తానని, నిరుద్యోగం తగ్గిస్తానని, అధిక ధరల్ని నియంత్రిస్తానని, అవినీతిని పారతోలుతానని చెప్పిన మాటలన్నీ నీటి మూటలయ్యాయన్నారు. ఐదేళ్ల పాలనలో ఏమీ సాధించని మోడీ తిరిగి 2018 ఎన్నికల్లో మతపరమైన అంశాలు ప్రచారం చేసి గెలిచిన విషయం గుర్తు చేశారు. పుల్వామా, కశ్మీర్ వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా చేసుకున్నారన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో అనుసరించిన సరళీకృత ఆర్థిక విధానాల వల్ల దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. వంద మంది శతకోటీశ్వర్ల దగ్గర 45 లక్షల కోట్ల సంపద పోగైందన్నారు. మరో పక్క పేదలు మరింత పేదలు గా మారి కనీసం రెండు పూటలు తినలేని దీన స్థితికి నెట్టబడుతున్నారని ఆనేక ఆర్థిక నివేదికలు పేర్కొంటున్నాయని తెలిపారు. దేశంలో అసమానతలను పెంచి రాజకీయంగా బలపడాలని బీజేపీ చూస్తుందన్నారు. బీజేపీ కార్పొరేట్ అనుకూల విధానాలు అనురించడం వల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు. మరో పక్క మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందన్నారు. లౌకిక విధానాన్ని విస్మరించి దేశంలో మతరాజకీయాలు చేస్తుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత రాజకీయాల ప్రభావం కార్మిక వర్గం పడుతుందన్నారు. ఐక్యంగా పోరాడాల్సిన కార్మికుల్ని మతం, కులం పేరిట విభజించేందకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.మల్లేశం, జి.సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజయ్య సహాయ కార్యదర్శులు ఎం. యాదగిరి, ప్రవీణ్ పాల్గొన్నారు.



చావులోనూ విడిపోని అన్నదమ్ములు

- ఒకేసారి నలుగురు మృతి
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- శోకసంద్రమైన చౌటపల్లి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్





నవతెలంగాణ-అక్కన్నపేట

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ రోడ్డు ప్రమాదంలో అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో మరణించిన ఆ నలుగురు అన్నదమ్ముల మృతదేహాలు గురువారం చౌటపల్లి గ్రామానికి చేరుకున్నాయి. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నాలుగు కుటుంబాలు పెద్దదిక్కు కోల్పోయి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఒకేసారి నాలుగు మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్తుంటే ఊరు ఊరంతా శోకసంద్రంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాలను హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ గురువారం పరామర్శించి మృతదేహాలకు నివాళులర్పించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బతుకుదెరువు కోసం సూరత్‌లో ఉంటున్నారని, ఈ మధ్యకాలంలోనే వారి చిన్ననాన్న చౌటపల్లిలో మృతి చెందగా ఆయన అంత్యక్రియలో పాల్గొని తిరిగి ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో ఔరంగాబాద్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీరి కారు ఫల్టీ కొట్టి ఎరుకల కృష్ణ, సంజీవ్, వాసు, సురేష్ అక్కడికక్కడే మృతి చెందారని కుటుంబీకులు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



నవతెలంగాణ వర్గల్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గౌరారం శివారులో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లాల్ గాడి మాలక్ పెట్ కి చెందిన లక్ష్మీ(61) అనారోగ్యంగా ఉండడంతో చేబర్తి గ్రామానికి చెందిన తన అల్లుడు గురువారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా గౌరారంలోని మామిడియాల కామన్ వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరవరం ఎస్సై సంపత్ కుమార్ తెలియజేశారు.

ద్విచక్ర వాహనం చక్రంలో చున్నీ చిక్కుకొని మహిళ మృతి

నవతెలంగాణ ములుగు



ద్విచక్ర వాహనం చక్రంలో చున్నీ చిక్కుకుని మహిళ మృతి చెందిన సంఘటన తునికి బొల్లారం సమీపంలో జరిగింది. గంగాధర్‌పల్లి గ్రామానికి చెందిన తాటికొండ శైలజ(19) తన భర్త సురేష్‌తో కలిసి తల్లిగారి ఇంటి నుండి వంటిమామిడి నోవారాబాద్ మండలం కల్లకల్ గ్రామం నుంచి తన అత్తగారిల్లు ములుగు మండలం గంగాధర్ పల్లి గ్రామానికి గురువారం ఉదయం 8.30 గంటలకు వెళ్తున్నారు. తునికి బొల్లారం సమీపంలో గల రోడ్డుపై వాహనం అతివేగంగా అజాగ్రత్తగా నడిపాడు. ఆమె మెడలోని చున్నీ బండి టైర్లలో చిక్కుకుని శైలజ కిందపడి ముఖానికి, తలకు తీవ్ర రక్త గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. ములుగు ఎస్సై రంగా కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హనుమాన్ బండల్ సమీపంలో గుర్తుతెలియని శవం లభ్యం

క్రైం కార్నర్

- హత్య చేసి ఉంటారని పోలీసుల అనుమానం

నవతెలంగాణ- కొల్చారం

కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామ శివారు మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన హనుమాన్ బండల్ సమీపంలో గల మంజీరా నది ఒడ్డున గురువారం గుర్తుతెలియని వ్యక్తి శవం లభించినట్లు కొల్చారం పోలీసులు గుర్తించారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్ బండల్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి శవం ఉందన్న విషయం తెలిసిందన్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహాన్ని తెల్లని గోనె సంచులతో రాళ్లకు కట్టి మంజీరాలో పడేసినట్లు తెలిపారు. శవం గుర్తుపట్టలేని స్థితిలో కుళ్లిపోయిందన్నారు. మృతిని వయస్సు 35 ఏళ్లు ఉంటాయని, చాతిపై జంగయ్య పేరుతో పాటు లవ్ సింబల్ ఉండి పక్కనే వీరమని పేర్లతో కూడిన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మరోవైపు కుడి భుజంపై ఓం గుర్తుతో పచ్చబొట్టు ఉందని గుర్తించారు. మృతుడి శరీరంపై బూడిద రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా తలపై గాయాలు ఉండడం పట్ల ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఎవరైనా ఉటే ఈ క్రింది నెంబర్లకు 8712657919, 8712657916, 8712657880, 871265888 సమాచారం ఇవ్వాలని కోరారు.


తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-నంగునూరు

తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాల పాలైన ఘటన నంగునూరు మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గీత కార్మికులు గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆ గ్రామానికి చెందిన బందారం శేఖర్‌గౌడ్(40) రోజు మాదిరిగానే శేఖర్ గౌడ్ బుధవారం మధ్యాహ్నం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. ఈ క్రమంలో చెట్టు పైనుంచి జారి కింద పడ్డాడు. పరిసర ప్రాంతంలోని బంధువులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శేఖర్‌గౌడ్‌కు బలమైన గాయాలయ్యాయి. వైద్యులు గాంధీకి రెఫర్ చేశారు. బంధువులు చొరవ తీసుకొని సిద్దిపేటలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కులవృత్తిపై ఆధారపడి జీవనం గడుపుతున్న శేఖర్‌గౌడ్ తాడిచెట్టు పైనుంచి పడడంతో అతని కుటుంబం రోడ్డున పడిందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అతని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. శేఖర్‌గౌడ్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

నవతెలంగాణ 2
సంగారెడ్డి
శుక్రవారం 26 మే 2023



కేతకిలో స్టేట్ ఇరిగేషన్ చీఫ్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఝరాసంగం

పురాతన శైవక్షేత్రాల్లో ఒకటైన శ్రీ కేతకి సంగమేశ్వర దేవాలయాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ ఇంజనీరింగ్ చీఫ్ నాగేందర్, అజయ్ కుమార్‌లు సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలోచించకుండా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని శ్రీ పార్వతీ సమేత సంగమేశ్వరునికి అభిషేకం నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. వారి వెంట సంగారెడ్డి జిల్లా చీఫ్ ఇంజనీరింగ్ మురళీధర్, డిప్యూటీ ఈఈ జానకి రామ్, ఎఈ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్ రమేష్‌కి షూస్ ఇప్పించిన వైద్యనాథ్




నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ సీఎం కప్-2023 కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం సంగారెడ్డి జిల్లాలో జరిగిన అథ్లెట్కిటిక్ 100 మీటర్ల పరుగు పందె ంలో కాళ్ళకి షూస్ లేకుండా బేగరి రమేష్ అనే వ్యక్తి 11.60 సెకండ్లలో గమ్యాన్ని చేరుకున్నాడు. పుల్కల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన రమేష్.. ప్రతిభ ఉన్నప్పటికీ పేదరికంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో సంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్.డి.వైద్యనాథ్ రమేష్ ప్రతిభను చూసి అతడికి షూస్ ఇప్పించారు. ఇంకా భవిష్యత్తులో క్రీడల్లో బాగా రాణించడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నారాయణఖేడ్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించడంతో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డిని గురువారం జేపీఎస్‌లు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓగా పదోన్నతి పొందిన నగేష్‌కు సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా డీఆర్‌ఓగా పదోన్నతి పొందిన మెంచు నగేష్‌ని డీఆర్‌ఓ ఛాంబర్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్, టీజీవో అధ్యక్షులు వైద్యనాథ్, హెల్పింగ్ అండ్ యూత్ అధ్యక్షులు రాహుల్, అఖిల్‌లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



నగేష్‌ను అభినందించిన పట్నం మాణిక్యం..

డీఆర్‌ఓగా పదోన్నతి పొందిన మెంచు నగేష్‌ను డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు కంది మండల రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రేమనందం ఉన్నారు.



పోచమ్మ ఆలయానికి లక్షా యాభై వేల విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని సొలక్‌పల్లి గ్రామపంచాయతీ మధిర గ్రామమైన ఇమామ్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ లక్ష యాభై రూపాయల విరాళం అందించేందుకు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సోలార్‌పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో పలువురు గ్రామస్తులు కలిసి ఆలయ నిర్మాణానికి సాయం చేయాలని అడగగా.. ఆయన వెంటనే స్పందించి రూ.1,50,000 విరాళం అందిస్తామని చెప్పారన్నారు. ఈ మేరకుగ్రామస్తులందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నీలం మధు ముదిరాజ్ యువసేన యువసేన నాయకులు బాలకృష్ణ, శ్రీకాంత్, నారబోయిన శ్రీనివాస్, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో రాయల్స్ విజయకేతనం



నవతెలంగాణ-సంగారెడ్డి

గురువారం ప్రకటించిన ఎంసెట్-2023 ఫలితాల్లో రాయల్స్ జూనియర్ కాలేజ్ విజయకేతనం ఎగరవేసిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కృపానిధి తెలిపారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థులు జీనత్ జావేద్, మహనీష్ సిద్దిక్, అరవింద్ ముస్కాన్ జహాన్, ప్రసన్నలక్ష్మి ఉత్తమ ఫలితాలు సాధించారని.. ఇది ఎంతో గర్వకారణమన్నారు. తమ కళాశాల విద్యార్థులు 'మాకు మేమే మేటి.. మాకెవరు లేరు పోటీ' అన్నట్టూ అన్నింటా తమ ప్రతిభను చూపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రంలో వీవోఏల చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 39వ రోజుకు చేరుకున్నది. అయితే సమ్మె చేస్తున్న వీవోఏలను విధుల నుంచి తొలగిస్తామంటూ పై అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వీవోఏల మండలాధ్యక్షురాలు మాధవి ఆరోపించారు. సమ్మెలో ఉన్న వివోఏలను నిర్బంధం చేయడం సరికాదని వాపోయారు. తమ న్యాయమైన 9 డిమాండ్‌లను వెంటనే పరిష్కరించి.. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల వివోఏల సంఘం ప్రధాన కార్యదర్శి కల్పన, కోశాధికారి విజయలక్ష్మి, వినయ, భవాని, వెంకటలక్ష్మి, సునంద, అరుంధతి, అరుణ,మమత, స్వప్న, ఉమా, లక్ష్మి, బుచ్చమ్మ, లక్ష్మీ, అమృత తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-జోగిపేట

భూ విక్రయంలో నెలకొన్న తగాదాతో మనస్తాపానికి గురై ఓ రైతు తన పొలం వద్దే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం ఉదయం జోగిపేట పట్టణంలో జరిగింది. జోగిపట ఎస్ఐ-2 జయశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన కడాల రమేష్ (50) మృతు డు గతేడాది క్రితం జరిగిన కూతురి వివాహం కోసం చేసిన అప్పులు తీర్చేందుకు కొన్ని రోజుల క్రితం తనకున్న భూమి నుంచి 20 గుంటల విక్రయించాడు. అయితే భూవివాదంలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న సమస్యతో భూమిని కొనుగోలు చేసిన యజమాని తన డబ్బులు తనకు ఇవ్వాలని, మీ భూమి మీకు ఇచ్చేస్తానని అనడంతో రమేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్తొస్తానని ఇంట్లో చెప్పి తన పొలం వద్దకు చేరుకొని మద్యం బాటిల్లో (ఎలుకల మందు) విషం కలుపుకొని సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రండి.. ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి...



- డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం అధ్యాపకుల క్యాంపెయిన్
- ప్రయివేటుకు ధీటుగా.. ప్రణాళికబద్ధంగా ప్రభుత్వ అధ్యాపకుల ప్రచారం

నవతెలంగాణ-జోగిపేట

నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను పెంచేందుకు ప్రభుత్వ అధ్యాపకులు నడుం బిగించారు. 'రండి ప్రభుత్వ కళాశాలలోనే చేరండి' అంటూ క్యాంపెయిన్ ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల పై ఈ తరహా ప్రచారం చేయగా.. తాజాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైతం ఈ కార్యచరణలోనికి దిగారు. డిగ్రీ ఆన్లైన్ సర్వీసెస్ తెలంగాణ దోస్తు ద్వారా ప్రభుత్వ కాలేజీల్లో చేరే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది.

విశాలమైన లైబ్రరీ సదుపాయం..



జిమ్ కూడా అందుబాటులో..



క్యాంపెయిన్ సాగుతున్నదిలా..

కళాశాల ప్రత్యేకతలతో కూడిన వినతి పత్రం ముద్రిస్తున్నారు. కళాశాల విద్యార్థుల గత విజయాలను దీంట్లో పొందుపరుస్తున్నారు. ఇంటర్ సెకండియర్ పరీక్షలు జరిగిన రోజుల్లో పరీక్షా కేంద్రాల వద్ద ఈ కరపత్రాలను పంపిణీ చేశారు. జూనియర్ కాలేజీలలో ద్వితీయ సంవ త్సరం పూర్తి చేసుకున్న విద్యార్థుల పేర్లు, ఫోన్ నెంబర్లను సేకరించి వారికి ఫోన్ల ద్వారా ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల్లో ప్రభుత్వ కళాశాలల ప్రత్యేకతలను వసతులను వివరిస్తూ కొన్ని సంక్షిప్త వీడియోలను తయారు చేసి పోస్ట్ చేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాల్, అధ్యాపకుల సహకారంతో పూర్వ విద్యా ర్థులు అడ్మిషన్లు పెంచడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నారు. దోస్త్ నోటిఫికేషన్ రాగానే కోర్సుల వారీగా విద్యార్థులకు చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

కోర్సుల వివరాలు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం బీఏ-హెచ్‌ఈపీ/హెచ్‌పీపీ(ఇంగ్లీష్, తెలుగు మీడియం), బీకాం-కంప్యూటర్ అప్లికేషన్(ఇంగ్లీష్, మీడియం), బీఎస్సీ-బీజెడ్‌సీ/బీజెడ్‌సీఎస్/ఎంపీసీ/ఎంపీసీఎస్(ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియం) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యాపకులు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అన్ని వసతులున్నాయి



ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపేటలో అన్ని రకాలైన వసతులు న్నాయి. విద్యార్థులకు జిమ్ సదుపాయం, యువ తరంగం జిజ్ఞాస మరియు టీఎస్‌కేసీ ద్వారా ఉద్యోగ నైపుణ్య శిక్షణ, ఉద్యోగాలు కల్పిస్తారు.. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థు లకు సామాజిక సేవ పట్ల అవగాహన పెంపొందించడం జరుగుతుంది. కావున తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేరేలా ప్రోత్సహించాలి.

- ఏ.గోపాల్, జంతు శాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట

ఉన్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకులు



ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనే అన్ని రకాల వసతులు ఉంటాయి. నెట్, సెట్, పీహెచ్డీ అర్హతలు ఉన్నవారే అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. విద్యార్థుల ప్రగతికి ప్రభుత్వ కళాశాలలే ఎంతో తోడ్పాటు అందించ గలవు. అడ్మిషన్లు పెంచడం కోసం మా అధ్యాపక మిత్రులందరం సమిష్టిగా కృషి చేస్తున్నాం. ఇంటర్ పరీక్షల సమయంలో విద్యార్థులకు కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రభుత్వ కళాశాలలో చేరాలని విన్నవిస్తున్నాం. సోషల్ మీడియా ద్వారా కూడా విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ పి.అడవి రాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, జోగిపేట

రైతులకు జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు అందజేత



నవతెలంగాణ-సదాశివపేట

60 శాతం సబ్సిడీతో జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలను మండలంలోని నందికంది గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 కిలోల బస్తాను రూ. 842-70లకు ఇవ్వను న్నట్టు తెలిపారు. రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు తీసుకువచ్చారన్నారు. అందులో భాగంగానే రైతులకు 60 శాతం సబ్సిడీతో ఈ విత్తనాలను అందజేస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సొసైటీ చైర్మెన్ మనోహర్‌రెడ్డి చింతా ప్రభాకర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అటు పిమ్మట సర్పంచ్ కుందన రాజు మాట్లాడుతూ.. సొసైటీ బిల్డింగ్ పాతది అని.. కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని కోరగా.. చింతా ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత సుధాకర్, ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, ఏడి మనోహర, రైతుబంధు అధ్యక్షులు అమరేందర్, సదాశివపేట సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మెన్ గడిల సుధీర్ రెడ్డి, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, ఆరూర్ ఎంపిటిసి అల్లం లలిత, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మునిగే నవీన్ కుమార్, పార్టీ మండలాధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3న గీతం 14వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా ఐఎస్‌ఓ వ్యవస్థాపక డీన్ ప్రమత్ రాజ్ సిన్హా
- గౌరవ డాక్టరేట్ అందుకోనున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ పట్టాల ప్రదానోత్సవం (స్నాతకోత్సవం) గీతం హైదరాబాద్‌లో జూన్ 3 న మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్టు గీతం హైదరాబాద్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీ.ఎస్. రావు వెల్లడించారు. గీతం హైదరాబాద్ ప్రాంగణంలో ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ కోర్సులను 2022-23 విద్యా సంవత్సరం నాటికి పూర్తిచేసిన విద్యార్థులు, డిగ్రీలు, డిప్లొమోలు పొందడానికి అర్హులన్నారు. గీతం కులపతి డాక్టర్ నరందర్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్‌తో పాటు ముఖ్య అతిథిగా ఇండి యన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌ఓ) వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్ర మం లో ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేస్తామన్నారు. ఇతర వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www.gitam.eduను సందర్శించాలని ప్రోవీసీ సూచించారు.

39వ రోజుకు వీఓఏల నిరవధిక సమ్మె





నవతెలంగాణ-సదాశివపేట

ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె గురువారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా వారు నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సమ్మెలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ చక్రవర్తికి వినతిత్రం అందజేశారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వివోఏల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదన్నారు. గత 39 రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం చాలా దుర్మార్గమన్నారు. 20 ఏండ్లుగా విధులు నిర్వహి స్తున్నా వారికి కనీసం వేతనం అమలు కావడం లేదన్నారు. అంతే కాకుండా ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. తక్షణమే వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల సమ్మెను మరింత ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి నాయకులు ఆంజనేయులు రోషన్, మోయిజ, జ్యోతి, లక్ష్మి,సరిత, సత్యమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

జోగిపేట : వీవోఏల సమ్మెకు అందోలు మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు మొల్ల ఫాతి యా బేగం మద్దతు తెలిపి మాట్లాడారు. వారిని సెర్ప్ ఉద్యో గులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు వీఎల్ఆర్, అభయహస్తం, డబ్బులు చెల్లించాలని, సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఐకేపీ వీఓఏల మండలాధ్యక్షులు మల్లయ్య, కార్య దర్శి ఆంజనే యులు, కోశాధికారి విజయ, వీఓఏలు అబ్దుల్ ఫహీం, రేణుక మానస బి.అశోక్, లాయక్ అలీ, ఎం.అశోక్, లక్ష్మణ్, సుప్రియ చంద్రిక స్వప్న భాగయ్య, వీరమని, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో ఎస్‌వీ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యారంగంలో అన్ని రకాల పోటీ పరీక్షల ఫలితాల్లో సంచలనం సృష్టిస్తూ.. సంగారెడ్డి జిల్లాలోనే ఎస్‌వి జూనియర్ కాలేజ్ ప్రభంజన సృష్టిస్తున్నదని ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి. రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ప్రకటించిన ఎంసెట్ -2023 ఫలితాల్లోనూ తమ కళశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారన్నారు. సానియా ఫాతిమా, వి.సిద్ధ, పి.శశిదర్, కే.వీరభద్రతో పాటు మరి కొంతమంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారికి, వారి తల్లి దండ్రులకు, బోధించిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి




నవతెలంగాణ-జిన్నారం

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలోని వ్యవసాయ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం రూ.16 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న గ్రంథాలయం ప్రహరీ గోడ నిర్మాణం మరమ్మతు పనులకు, రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కుంచాల ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్ స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గంతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాలు చేశారు. మండలానికి నూతనంగా మంజూరైన కోర్టు ఏర్పాటులో భాగంగా కోర్టు భవనం కోసం గ్రామంలోని పాత జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాన్ని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ నాయ కత్వంలో ప్రతీ రైతుకు రైతు పెట్టుబడి, సకాలంలో సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు పండించిన పంటకు మద్దతు అందిస్తూ రైతన్నకు అండగా నిలుస్తున్నారన్నారు. కోర్టుకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ జిన్నారం సీనియర్ నాయకులు నర్సింహారెడ్డిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంతిరెడ్డి గారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ, జిన్నారం సీఐ వేణు కుమార్, ఎస్సై విజయరావ్, సర్పంచులు ప్రకాశం చారి శెట్టి శివరాజ్, ఖదీర్, ఆంజనేయులు అగ్రికల్చర్ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి, బీఆర్ఎస్ జిన్నారం మండలం అధ్యక్షులు రాజేష్, నాయకులుస్వాతి ప్రభాకర్‌రెడ్డి, భీమ్రావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు



నవతెలంగాణ-జహీరాబాద్

చెరుకు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని టీపీసీసీ నాయకులు వై.నరోత్తం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారు 24 వేల ఎకరాల్లో 10 లక్షల టన్నుల పై చిలుకు చెరుకు పంటను పండిస్తున్నారన్నారు. కానీ ట్రైడెంట్ చక్కర కర్మాగారం మాత్రం రెండున్నర లక్షల టన్నుల చెరుకు మాత్రమే క్రష్ చేసిందన్నారు. మిగతా చెరుకు అంతా ఇతర ప్రాంతాలకు తరలించారన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల గతంలో కర్మాగారం లాకౌట్ చేశారన్నారు. క్రషింగ్ జరిపిన చెరుకుకు ఇప్పటివరకు బకాయిలు చెల్లించనే లేదన్నారు. అవి సుమారు రూ.12 కోట్ల 70 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కర్మాగారంలో చక్కెర నిల్వ ఉన్నది మాత్రం కేవలం రెండున్నర కోట్ల విలువ మాత్రమే అని.. బకాయిలు ఏ విధంగా చెల్లిస్తారో ? ఇది పూర్తిగా ప్రభుత్వ అసమర్థతే అన్నారు. వచ్చే సంవత్సరం కర్మాగారంలో క్రషింగ్ జరుగుతారో లేదో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారన్నారు. మొన్న కురిసిన అకాల వర్షాల వల్ల తీవ్రంగా పంట నష్టం జరిగిందని.. వెంటనే క్షేత్రస్థాయిలో తిరిగి పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేయగా ప్రభుత్వం కూడా స్పందించి.. ఎకరాకు పదివేలు చెల్లిస్తామన్నారు. కానీ అది కేవలం మాటలకే పరిమితం అయిందన్నారు. రైతులకు ఇప్పటి వరకు రైతుబంధు రూ 10,000 ఇవ్వనేలేదని.. రుణమాఫీ అసలే జరగనే లేదన్నారు. వేసవి కాలం ముగిస్తున్నదని.. కొత్త పంటలు వేసే కాలం ఆసన్నమైంది కానీ ప్రభుత్వం విత్తనాలు, ఎరువుల పైన గాని, నకిలీ విత్తనాలు అరికట్టే విషయంలో గాని ఏది స్పష్టత లేదనారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరుకు రైతులకు బకాయిలు వెంటనే ఇప్పించాలని.. వచ్చే సంవత్సరం క్రషింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పంట నష్టపరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. ఎరువుల సరఫరా, నకిలీ విత్తనాలు అరికట్టుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముల్తానీ,మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి, మండల కో ఆప్షన్ సభ్యులు మైనోద్దీన్, మాజీ సర్పంచ్ శంకర్, మహ్మద్ యూసుఫ్, బి.మోహన్ రెడ్డి, షరీఫ్, శ్రీకాంత్, షాహిద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తెలంగాణలో విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన నాటు సారాను జంగార్ బౌలి తాండాలో విక్రయిస్తున్న రాథోడా అనిల్ కుమార్‌ను అరెస్టు చేసి మాండ్‌కు తరలించినట్టు చిరాకుపల్లి ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ కుమార్ కర్నాటక రాష్ట్రం నుంచి తక్కువ ధరకు నాటు సారాను తీసుకువచ్చి.. తన ఇంటికి దగ్గరలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. ఇందుకు సంబంధించి నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడి చేసి.. నిందితుడిని పట్టుకున్నారు. కాగా మూడు ప్లాస్టిక్ బాటిళ్లలో గల 05 లీటర్‌ల నాటు సారాను స్వాధీనం చేసుకుని.. సు మోటోగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిషేధిత, చట్ట విరుద్ధ కార్యకలాపాలైన మట్కా, పేకాటలకు ఎ వరైనా పాల్పడితే 8712656766కు సమాచారం ఇవ్వా ల న్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు వట్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-వట్‌పల్లి

మండల కేంద్రమైన వట్‌పల్లిలో అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నేడు(శుక్రవారం) ఆత్మీయ సమ్మేళనం చేపట్టనున్నట్టు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు దామోద రాజనర్సింహ వ్యవసాయ మార్కెట్ నుంచి వెంకట కాజా ఫంక్షనల్ హాలుకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడుతారన్నారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ 3
మెదక్
శుక్రవారం 26 మే 2023



రూ.10 లక్షలతో రిటైర్డ్ ఉద్యోగుల భవనం

ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ పట్టణంలో రూ.10 లక్షల వ్యయంతో రిటైర్డ్ ఉద్యోగుల భవనం నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని మండల వనరుల కేంద్రం పక్కన రూ.10 లక్షలతో నిర్మించనున్న రిటైర్డ్ ఉద్యోగుల భవనానికి ఎమ్మెల్యే మదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ భవన నిర్మాణానికి తాను స్వయంగా రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, జెడ్పీటీసీ బబ్యా నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భోగచంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబల బిక్షపతి, సర్పంచుల పోరం మండల అధ్యక్షులు జితేందర్ రెడ్డి, సర్పంచులు శ్రీరాములు. సేనాధిపతి, లావణ్య రవి, నాయకులు హబీబ్ ఖాన్, ఆంజనేయులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాల్లో 'శ్రీ అక్షయ' కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎంసెట్ 2023 ఫలితాలలో శ్రీ అక్షయ జూనియర్ కాలేజ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ వీరప్ప ప్రిన్సిపాల్ శ్రీశైలం తెలిపారు. అమ్మానుద్దీన్, సాయి మణిదీప్, వర్ష, విదీక్షతో పాటు 15 వేల ర్యాంకులులోపు 14 మంది విద్యార్థులు సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యజమాన్యం అభినందనలు తెలియజేశారు. విద్యార్థులను అభినందించిన వారిలో డైరెక్టర్లు రాజు గౌడ్, సుధాకర్ జోషి, భానుచందర్ రెడ్డిలు ఉన్నారు.

క్రీడాకారున్ని సన్మానించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన ప్రవీణ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎన్నికైనందున గురువారం జెడ్పీటిసి పంజా విజయ్ కుమార్ ప్రవీణ్‌ను శాలువాతో సన్మానించి రూ.2 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, జిపి స్వామి, జాల పోచయ్య, శ్రీనివాస్, కిష్టయ్య, స్వామి గౌడ్, చంద్రయ్య, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రానికి చెందిన ముయ్యడి పోచమ్మ మల్లేష్ దంపతుల కూతురు వివాహానికి జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు శివ్వంపేట జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త రూ. 10 వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్త మాట్లాడుతూ పేదింటి ఆడపడుచుల వివాహానికి తనవంతు సహాయ సహకారాలు తప్పకుండ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ రాజపేట పద్మా వెంకటేష్ బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ముద్దగల లక్ష్మీనర్సయ్య, వార్డు సభ్యులు బాసంపల్లి పోచ గౌడ్, వంజరి కొండల్, ముయ్యడి సింహం, నాయకులు దొడ్ల అశోక్ ఖదీర్ త్రినేష్ గౌడ్, కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, రజాక్ సందీప్, మహేష్, జోగిని నవీన్ పైనం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-టేక్మాల్ : టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కోడపాక కిషన్ గత కొద్దిరోజుల క్రితం యాక్సిడెంట్ జరిగి పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు క్రాంతి కిరణ్ బాధితుడు కిషన్ తల్లి కొడపాక పెంటమ్మకు గురువారం రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఈశ్వరప్ప, రాజేష్ గౌడ్, ఉపాధ్యక్షులు విఠల్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శాపొద్దీన్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ రవి శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ మండల కార్యవర్గ సమావేశం



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

పెద్ద శంకరంపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు పేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ తెలిపారు. పేటలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:00 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల బూత్ కమిటీ అధ్యక్షులు. కార్యదర్శులు బాధ్యులు వివిధ మోర్చాల కమిటీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు మండల నాయకులు అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన మంగలి పల్లి నరేష్(20) ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. నరేష్ కుటుంబాన్ని మండల జెడ్పిటిసి పంజా విజయకుమార్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మృతుని తండ్రికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్,జాల పోచయ్య, జిపి స్వామి, శ్రీనివాస్, స్వామి గౌడ్, స్వామి, చంద్రం, చంద్రయ్య, బొమ్మన కిష్టయ్య, బెస్త కుల సభ్యులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

నవ తెలంగాణ-నర్సాపూర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం నర్సాపూర్ పట్టణంలోని సంగారెడ్డి వెళ్లే మార్గంలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన బూసగల్ల శ్రీనివాస్ (42), వెల్మ కన్య కృష్ణలు నర్సాపూర్ వైపు నుంచి సంగారెడ్డి వైపు బైక్ పై వెళ్తున్నారు. మార్గమధ్యంలో సంగారెడ్డి వైపు నుంచి నర్సాపూర్ వైపు వస్తున్న ట్రాలీ ఆటో ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బుసగాళ్ల శ్రీను తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే బైక్ పై ఉన్న మరో వ్యక్తి వెల్మ కన్యా కృష్ణకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

గ్రామాభివృద్ధికి ఎల్లవేళల చల్మేడ అండ

ఫీడ్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-బెజ్జంకి

తోటపల్లి గ్రామానికి ఎల్లవేళ చల్మేడ అండగా ఉంటుందని చల్మేడ ఫీడ్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు స్పష్టం చేశారు. గురువారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి వైకుంఠ వాహనాన్ని చల్మేడ ఫీడ్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు అందజేశారు. చల్మేడ సంస్థలు ప్రజల సమస్యలకు తమ చేయూతనందిస్తూ అండగా నిలుస్తుందని సర్పంచ్ బోయినపల్లి నర్సింగరావు కొనియాడారు. అనంతరం తోటపల్లికి అండగా నిలుస్తున్న వెంకటేశ్వర్ రావును సర్పంచ్ నర్సింగరావు శాలువా కప్పి సన్మానించారు. వార్డ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీలకు భవనాలేవి?

- నూతన జీపీలకు భవనాలు లేక అవస్థలు
- ప్రైవేట్ గదులు పాఠశాల లలో గ్రామ సభలు సమావేశాలు
- ఏళ్ళు గడుస్తున్నా పాటించుకొని పాలకులు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ప్రభుత్వం 500ల జనాభా ఉన్న ప్రతి గ్రామాన్ని గిరిజన తాండలను గ్రామపంచాయతీలుగా మార్చింది. గ్రామ పంచాయతీలుగా మార్చి 5 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పంచాయతీ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమయిందని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు ఆరోపిస్తున్నారు. అద్దె భవనాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో, బీసీ కమ్యూనిటీ హాళ్లలో ఉంటూ ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

పంచాయతీ భవనాలు కరువు

పెద్దశంకరంపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా మరో 5 పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది . దీంతో మండలంలో 27 గ్రామ పంచాయతీలు అయ్యాయి. ఇందులో కొన్ని పంచాయతీ భవనాలు శిథిలావస్తకు చేరాయి. మండలంలో నూతనంగా జామున నాయక్ తండా, ఇసుకపాయాతండా, గోపని వెంకటాపూర్, సంగారెడ్డి పేట, దానంపల్లి, పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఈ జీపీలకు నూతన భవనాలు మంజూరు చేయక పోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా పాఠశాలల అదనపు గదులలో మరియు బీసీ కమ్యూనిటి హాలలో పాలన కొనసాగిస్తున్నారు.. దీంతో గ్రామ సభలు సమావేశాలు నిర్వహించేందుకు ఎన్నో ఇబందులు ఎదురరౌ వుతాన్నాయని వాపోతున్నారు. 5 సంవత్సరాలుగా పాఠశాలలు కమ్యూనిటి హాల్లో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగించారు. ఇప్పటికైనా పంచాయతీలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సభకు తిప్పలు

గడ్డి రణెమ్మ దానంపల్లి సర్పంచ్



గ్రామం లో ఏర్పటైన గ్రామపంచాయతీ కార్యాలయం బీసీ కమ్యూనిటీ హాల్లో కొనసాగిస్తున్నాం. గ్రామ సభ నిర్వహించాలంటే స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నాం.

పురాతన భవనంలో కొనసాగిస్తునాం

మోతి బాయి జాముననాయక్ తండా సర్పంచ్



జాముని నాయక్ తండాలో నూతనంగా ఏర్పాటు అయినా జీపి భవనం పురాతన పాఠశాల భవనంలో ప్రభుత్వ కార్యక్రమలు నిర్వహిస్తునాం. వర్షానికి ఎప్పుడు కులుతోందో తెలువదు. ఇప్పటికె రికార్డ్‌లపై దుమ్ము పడుతుంది.



ప్రతిపాదనలు పంపించాం

శ్రీనివాస్ పిఆర్ డిఈ అల్లాదుర్గం

ప్రతిపాదనలు పంపిచాము. నూతనంగా ఏర్పాటైన పంచాయతీలకు భవనాలు లేక ఇబ్బంది పడుతున్నా విషయం వాస్తవమే 7 పంచాయతీ లకు సంబదించి ఉన్నంతధికారులకు పంపిచాం అన్నారు మంజూరు కాగానే నిర్మాణం చెప్పడతామన్నారు.

లారీలను తొందరగా అన్లోడ్ చేసుకోవాలి

మిల్లర్లను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

నవతెలంగాణ-తూప్రాన్‌రూరల్/మనోహరాబాద్

మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా దించుకుంటేనే తిరిగి లోడింగ్ చేయడానికి అవకాశాముంటుందని, కాబట్టి హమాలీలలను అధిక సంఖ్యలో పెట్టుకొని లారీలు వచ్చిన 24 గంటల్లోగా ధాన్యం ఆన్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ రమేష్ మిల్లర్లకు సూచించారు. గురువారం తూప్రాన్ పట్టణంలోని నవదుర్గ రైస్ మిల్, సాయినాథ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి మిల్లులకు వస్తున్న ధాన్యాన్ని వెంటవెంటనే దించుకోవాలని సూచించారు. తద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి కూడా ధాన్యాన్ని త్వరత్వరగా లోడింగ్ చేయడానికి అవకాశముంటుందన్నారు. ధాన్యంలో కోత పెట్టరాదని, వెంటనే ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. అదేవిధంగా పెండింగ్ సి.ఎం.ఆర్. రైస్‌ను రోజు వారి లక్ష్యం మేరకు నెలాఖరులోగా భారత ఆహార సంస్థకు తరలించాలని సూచించారు. గన్ని సంచులు, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఈ పక్షం రోజులు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజు కొనుగోళ్లు ఆగకుండా, రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.



ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తున్నామని రమేష్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 407 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 33, 776 మంది రైతుల నుంచి 295 కోట్ల 33 లక్షల విలువ గల 1,43,362 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 10,379 6 మంది రైతుల ఖాతాలో రూ.84.76 కోట్లు వేశామన్నారు. టాబ్ ఎంట్రీ కూడా వేగవంతంగా జరుగుతున్నదని త్వరలో మిగతా రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బులు వేస్తామని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. శ్యామ్ ప్రకాష్, తహశీల్దార్ జ్ఞాన జ్యోతి పాల్గొన్నారు.



నవ తెలంగాణ-నర్సాపూర్ : రైస్ మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ సూచించారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామ శివారులో ఉన్న మహాలక్ష్మి రైస్ మిల్లును అదనపు కలెక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తీసుకు వస్తున్న లారీలను వెంటనే అన్లోడ్ చేసి పంపించాలని రైస్ మిల్ సిబ్బందికి సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాకులు, రైస్ మిల్లర్లు చూడాలన్నారు.

65 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మనోహరాబాద్ వ్యవసాయ అధికారి రాజశేఖర్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ మనోహరాబాద్

మనోహరబాద్ మండల వ్యాప్తంగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని రైతులు విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అగ్రో రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు 65వ శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేసి ఆన్లైన్ పర్మిట్ పొందాలని సూచించారు. ఆ పర్మిట్లు తీసుకుని అగ్రో సేవా కేంద్ర కేంద్రాల్లో అందించి విత్తనాలను పొందాలని సూచించారు. 65 శాతం సబ్సిడీ పోను 30 కేజీల జీలుగ బస్తా ధర రూ.842.70లని తెలిపారు. ఒక బస్తా రెండున్నర ఎకరాలకు సరిపోతుందని, పచ్చిరొట్ట విత్తనాలు వాడడం వల్ల భూమి భౌతిక, రసాయన స్థితి మెరుగుపడుతుందన్నారు. దాంతో పాటు గా సేంద్రియ కర్బన పదార్థం పెరిగి పంటకు మేలు చేసేటువంటి సూక్ష్మజీవులు వాన పాముల సంతతి పెరిగి భూసారం పెరిగి తద్వారా రైతుల పంట దిగు బడి పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రైతులు పచ్చిరొట్ట వేయడం వల్ల ఎకరానీకి 10 టన్నుల పచ్చి రొట్ట ఏరువు లబిస్తుంది .60 కిలోల నత్రజని , 15 కేజీల భాస్వరం , 50 కేజీల పొటాష్ భూమిలో కలుస్తుందని అన్నారు. పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల నేల బౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుందని తెలిపారు. నేలలో సేంద్రీయ పదార్థం పెరగడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, జీవ రసాయనిక చర్యల వల్ల నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచు కుంటుందని తెలిపారు. భూమిలో రసాయన ఎరువులు వేసినపుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడతాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించవచ్చని, చౌడు భూముల పునరుద్దరణకు ఉపయోగపడుతుందని ఎకరానికి 12 నుంచి 15 కిలోల పచ్చి రొట్ట విత్తనం అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.

నిపుణుల సూచనల మేరకు పంటలు వేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి

నవతెలంగాణ-నార్సింగి

రైతులు వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పంటలు వేసుకుంటే కొంతవరకు నష్టాలను నివారించవచని మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి సూచించారు. వానాకాలం పంటలపై పలు సలహాలు, సూచనలు రైతులకు అందజేశారు. వానాకాలంలో రైతులు ముఖ్యంగా ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. యాసంగి, వానకాలంలో ఒకే రకం పంట వేసుకోవడం వలన భూమి సారాన్ని కోల్పోతుందిని, చీడపురుగులు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. తద్వారా దిగుబడి తగ్గి రైతులకు నష్టం చేకూరుతుందన్నారు. వానాకాలంలో వరి పంటను ఆశించేవి మోగి పురుగు, ఆకు మొదలి పురుగు లని, ఒకవేళ ఈ చీడపురుగులు ఆశించినట్లయితే సరైన మోతాదులో మోనోక్రోటోఫాస్, కార్టాప్ హైడ్రోక్లోరైడ్, లామ్డాసైహాల్త్రోరిన్ మందులను వాడాలని సూచించారు. పొటాష్ వాడకం వల్ల పంటకు, బలం నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పత్తి వేసే రైతులు పతి విత్తనాలు పెట్టేటప్పుడు సమాన దూరంలో విత్తనాలను పెట్టాలనీ, ఇష్టానుసారంగా పురుగుల మందులు వాడ కూడదన్నారు. పంటను చీడపురుగులు ఆశించినట్లయితే రైతులు వేప నూనెను పిచికారి చేయాలన్నారు. సాధ్యమైనంతవరకు రైతులు రసాయనిక ఎరువుల జోలికి వెళ్ళకూడదన్నారు. అనవసర మందులు వాడి పంట పెట్టుబడిని పెంచుకోకూడదని తెలిపారు. మొక్కజొన్న పంట వేసేటప్పుడు విత్తనాలను సమాన దూరంలో కాలువల పద్ధతిలో పెట్టాలలన్నారు. ఈ పంటను



ముఖ్యంగా మోగి పురుగులు, కత్తెర పురుగులు ఆశిస్తాయన్నారు. మోగి పురుగులు ఆశించినప్పుడు క్లోరోపైరీఫాస్, వేప నూనె పిచకారీ చేయాలనీ, కత్తెర పురుగులు ఆశిస్తే ఏమామెక్టిన్ బెంజోవేట్ మందును వాడాలన్నారు. సోయాబీన్ పంటను మడుల పద్ధతిలో వేసుకోవాలనీ, సోయాబీన్ కి చీడపురుగుల బెడద తక్కువనీ అన్నారు. మంచి దిగుబడి కోసం భూమి పదును, తేమశాతం సరిచూసుకోవాలనీ ఆయన రైతులకు సూచించారు. ఏ పంట కైనా గాని ఎకరాకు 200 లీటర్ల నీటిలో 80 గ్రాముల మందును కలుపుకోవాలనీ, ఇదే సరైన మోతాదు అని ఈ మోతాదు మించ కూడదని, తగ్గ కూడదని ఆయన తెలిపారు. సలహాలు, సూచనల కోసం వ్యవసాయ కార్యాలయంలోగాని, 091788878445 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి మెంగని యాదగిరి సూచించారు.

జహీరాబాద్‌లో రెండు వైద్యశాలు సీజ్



నవతెలంగాణ-జహీరాబాద్

చట్టరీత్యా అనుమతులు తీసుకోకుండా సేవలందిస్తున్న రెండు వైద్యశాలలను జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి గురువారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని బ్లాక్‌రోడ్‌లో 'చందు పాలీ క్లినిక్' పేరుతో డాక్టర్ బి.సుధీర్‌కుమార్ పాలిక్లినిక్ నిర్వహించేందుకు అనుమతులు తీసుకోగా.. ఆ వైద్యశాలలో విదేశాల్లో విద్యను అభ్యసించిన డాక్టర్ రమేష్ వైద్య సేవలు అందిస్తున్నాడు. డాక్టర్ రమేష్ విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యను అభ్యసించినప్పటికీ భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో ఆయనకు భారతదేశంలో వైద్య పరీక్షలు నిర్వహించే హక్కు లేదు. కనుక చట్టవిరుద్ధంగా ఒకరి పేర అనుమతులు తీసుకొని మరొకరు వైద్యశాల నడుపుతున్నందుకు 'చందు పాలిక్ క్లినిక్' ను సీజ్ చేసినట్టు జిల్లా వైద్యాధికారి తెలిపారు. అలాగే అనురాగ్ థియేటర్ వద్ద గ్రేస్ వైద్యశాల పేరుతో అనుమతులు లేకుండా వైద్యశాలను నడిపిస్తున్న యజమాన్యంపై చట్టరీత్యా చర్య తీసుకొని పదివేల రూపాయల ఫైన్ వేసి.. వైద్యశాలను సీజ్ చేశారు. జిల్లాలో ఎక్కడైనా అనుమతులు లేని క్లినిక్ లు, డయాగ్నసిక్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు, ఆయుష్ క్లినిక్‌లో ఉంటే తక్షణమే వాటిని మూసుకోవాలని.. లేదా చట్టపరంగా అనుమతులు తీసుకోవాలని గాయత్రి దేవి సూచించారు. లేని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తి వేయాలి

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక భవనం ఎదుట ప్లకార్డులతో నిరసన

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం : బొల్లారంలోని హార్టెక్స్ రబ్బరు పరిశ్రమలో అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తి వేయాలని కార్మికులు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక భవనం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కార్మిక భవన్‌లో కార్మిక శాఖ అధికారులతో పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, పరిశ్రమ యాజమాన్యంతో మీటింగ్ నిర్వహించారు. అక్రమ లాకౌట్ వెంటనే ఎత్తి వేయాలని, పీఎఫ్ బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని, అక్రమంగా ఎలాంటి షోకాజ్ నోటీసులు లేకుండా సస్పెండ్ చేసిన 12 మంది కార్మికులను సస్పెండ్ ఎత్తి వేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



చింతా ప్రభాకర్ జోలికి వస్తే ఖబర్దార్



నవతెలంగాణ-సంగారెడ్డి

చింతా ప్రభాకర్ జోలికి వస్తే ఖబర్దార్ అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు నర్సింలు అన్నారు. గురువారం చింత ప్రభాకర్ క్యాంప్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకర్గ అభివృద్ధి కోసం చింతా ప్రభాకర్ ఎంత కృషి చేస్తున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. చింతా ప్రభాకర్ గురించి తప్పుగా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా అనునిత్యం ప్రజల మధ్య ఉంటున్న వ్యక్తి చింతా ప్రభాకర్ అన్నారు. మైనార్టీలకు సంగారెడ్డి , సదాశివపేటలలో స్మశానవాటికకు స్థలం కేటాయించిన ఘనత చింతా ప్రభాకర్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు వాగ్వాదం జరిగితే కాంగ్రెస్ కౌన్సిలర్ జోక్యం చేసుకొని దాడికి పాల్పడ్డారన్నారు. దాడికి పాల్పడిన కౌన్సిలర్ పై ఫిర్యాదు చేస్తే చింత ప్రభాకర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. చింత ప్రభాకర్‌కు ఫిర్యాదుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీకాంత్, జలంధర్ రావు, సమీ, అజీమ్, అజ్జు తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.1 కోటి 5 లక్షలు



నవ తెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించగా హుండీ ఆదాయం రూ.1 కోటి 5 లక్షల 83 వేల 558 వచ్చింది. గురువారం కొము రవెల్లిలోని ఆలయ ముఖ మండపంలో ఆలయ ఈఓ బాలాజీ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి 59 రోజులలో హుండీలలో భక్తులు సమర్పించిన నగదు రూ.1 కోటి 5 లక్షల 83 వేల 558, విదేశి కరెన్సీ నోట్లు 27, మిశ్రమ బంగారం 68 గ్రాములు, మిశ్రమ వెండి 11కిలోల 100 గ్రాములు, పసుపు బియ్యం 18 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం ఈఓ బాలాజీ మాట్లాడుతూ హుండీ ద్వారా వచ్చిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, చైర్మెన్ భిక్షపతి, ఆలయ ధర్మకర్తలు, సౌజన్య ఆలయ పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ సేవ సమితిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ-బెజ్జంకి : సీఎం కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను గ్రామగ్రామాన అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎమ్మెల్యే రసమయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి దినం ఒక పండుగ వాతావరణాన్ని తలపించేల ఏర్పాట్లు చేయాలని ప్రజాప్రతినిధులకు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎఎంసీ చైర్మన్ రాజయ్య, ఎంపీడీఓ దమ్మని రాము,నాయిబ్ తహసీల్దార్ పార్థసారథి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జంకి : మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన రొడ్డ లక్ష్మి ఇటీవల మృతి చెందారు. గురువారం పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్ రావు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం దాచారం గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి ఉత్సవాలకు శరత్ రావు హజరై దర్శించుకున్నారు. నాయకులు పోచయ్య, చెన్నారెడ్డి తదితరులు హజరయ్యారు.





వీవోఏల పట్ల ప్రభుత్వ వైఖరి వీడాలి

- చెవిలో పూలతో నిరసన తెలిపిన వీవోఏలు



నవతెలంగాణ-కొండపాక

ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల రోజుల నుండి సమ్మెబాట పట్టారు. గురువారం కొండపాక మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చెవిలో పూలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో దొమ్మాట నాంపల్లి యాదయ్య, శంకర్, రాములు, కిష్టయ్య, మహాలక్ష్మి, భాగ్యరాణి, పద్మ భాగ్య స్వప్న, లక్ష్మి, రేణుక, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సదస్సుకు తరలి వెళ్లిన కార్మికులు



నవతెలంగాణ-చేర్యాల

ఉపాధి హామీ పథకం పై బీజేపీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన సదస్సు లో పాల్గొనేందుకు చేర్యాల మండలంలోని వ్యవసాయ కార్మికులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో మాట్లాడుతూ వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కరించాలని, రోజు కూలి రూ. 600 పెంచాలని, ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరలి వెళ్లిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, బోయిని మల్లేశం,కనకవ్వ, బాలమణి, బాలరాజు తదితరులు ఉన్నారు.

దృష్టి లోపాన్ని నివారించడానికే కంటి వెలుగు

- సుడా చైర్మన్ మా రెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి

నవతెలంగాణ -సిద్దిపేటరూరల్



దృష్టిలోపాన్ని నివారించడానికే కంటి వెలుగు పథకాన్ని కెసిఆర్ ప్రవేశపెట్టారని సుడా చైర్మన్ మా రెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పరిధిలోని రావు రుకుల గ్రామంలో సర్పంచ్ నీరటి కవిత రవీందర్ తో కలిసి రెండవ విడత ఉచిత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాదయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ లక్కర్స్ ప్రభాకర్ వర్మ, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి , ఎంపీటీసీ హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శిల్ప, ఏఎన్ఎం కరుణావతి, అంగన్వాడి టీచర్ భాగ్యమ్మ, ఆశా వర్కర్ పద్మ, శోభ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ ఏఈగా యాదగిరి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక మున్సిపల్ నూతన ఏఈగా వై.యాదగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట మున్సిపల్‌తో పాటు దుబ్బాక మున్సిపల్ ఏఈ గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడున్న ఏఈ పృథ్వీరాజ్ సిద్దిపేట మున్సిపల్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ కు బదిలీ అయ్యారు.

రాష్ట్ర పద్మశాలి భవనం భూమి పూజకు తరలిరండి

నవతెలంగాణ- సిద్దిపేట

ఈ నెల 27న మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాదులోని కోకాపేటలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించబోయే తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఆత్మగౌరవ భవనం నిర్మాణం భూమి పూజకు జిల్లా పద్మశాలీలు తరలిరావాలని సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్, ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి భూమి పూజ చేయనున్నారని, ఈ కార్యక్రమానికి మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్ యాదవ్ , శ్రీనివాస్ గౌడ్ లు పాల్గొననున్నారని తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల , బెజ్జంకి లలోని అన్ని మండలాలలో, గ్రామాలలో , పట్టణాలలోని పద్మశాలీలు, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

- పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ కార్యకర్త రాంభూపాల్ రెడ్డి (50) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆయన వెంట మద్దూర్ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, సర్పంచుల పురం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, బైరన్ పల్లి ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చొప్పరి సాగర్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు ఋతుచక్రంపై అవగహన

నవతెలంగాణ-మర్కుక్



స్త్రీలకు ఋతుచక్రం , ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు, ప్లాస్టిక్ నిషేధం పలు అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఎస్ డబ్ల్యూఎంఆర్టీ వాలంటీర్ డా. శాంతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లిలో ఋతుప్రేమ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మెన్స్ట్రువల్ కప్ వాడడం వలన మహిళలకు ఆరోగ్యం, ప్రకృతి ని కాపాడటం, డబ్బులు ఆదా చేయడం, జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపివో దేవకి దేవి, ఎంపిడివో ప్రవీణ్, డీఎల్పీవో వేదవతి, గ్రామ సర్పంచ్ అప్పాల స్వరూప, ఎంపివో రాజలింగం, ఋతుప్రేమ స్పెషల్ ఆఫీసర్ మాధవి, ఉపసర్పంచ్ బట్టు అండాలు, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, ఐకెపి ఏపీఎం, సిసి, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

గోసాన్ పల్లిలో పామాయిల్‌పై రైతులకు అవగాహన

- ఉద్యాన శాఖ అధికారి ఆర్. బాలాజీ

నవతెలంగాణ-దుబ్బాక రూరల్



ఆయిల్ ఫామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఫామాయిల్ సాగుపై రైతులంతా దృష్టి సారించాలని దుబ్బాక మండల ఉద్యాన శాఖ అధికారి ఆర్. బాలాజీ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని గోసాన్ పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్.బాలాజీ మాట్లాడుతూ పామాయిల్ సాగుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రాయితీలు, ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు గ్రామ రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండడి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఏఈఓ అస్మా, బిఆర్ఎస్ నాయకుడు దొండడి తిరుపతిరెడ్డి, గ్రామ రైతులు ఉన్నారు.

దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరిశేఖర్‌గౌడ్

నవతెలంగాణ-తొగుట



దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండాను ఎగరవేస్తామని బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి శేఖర్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దుబ్బాకలో గులాబీ జెండా ఎగుర వేయడమే ప్రధాన లక్ష్యంగా యువత పనిచేయాలని సూచించారు. గ్రామ గ్రామన విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీలు తొందరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు అరుణ్, నాయకులు అనిల్, బండారు రమేష్ గౌడ్,బైరారెడ్డి, సురేష్ గౌడ్, రాజ శేఖర్,బోయిని బాలరాజు, ఎల్లగౌడ్, స్వామి, శ్రీనివాస్, మహేష్, కృష్ణ, శ్రీకాంత్, కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

యువకులకు క్రీడా వస్తువుల పంపిణీ

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన యువకులకు సర్పంచ్ నాంపల్లి సవిత చంద్రశేఖర్ క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో యువకులను క్రీడలలో ప్రోత్సహించేందుకు తనవంతుగా క్రికెట్, వాలీబాల్ తదితర కిట్లను యువతకు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

బీజేపీ మతోన్మాద విధానాలను ఎదిరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాలను కార్మిక వర్గం ఐక్యతతో ఎదిరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి కోరారు. మతోన్మాదం కార్మిక వర్గం ఐక్యత అనే అంశంపై సిద్దిపేటలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత విభజన సమీకరణ వెనకాల ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర పోషిస్తుందని విమర్శించారు. దేశంలో కార్పొరేట్ శక్తుల లాభాలకు ఎదురులేకుండా చేయాలని కార్మిక ఐక్యతను బిజెపి దెబ్బతీయాలను చూస్తుందని అన్నారు. భారతదేశం ఆర్థికంగా నిలబడడానికి వెన్నుముకగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అతి తక్కువ రేట్లకే అప్పనంగా కేంద్ర ప్రభుత్వం అమ్ముతుందన్నారు. రైల్వేలు కోర్టులు బొగ్గు బావులు టెలికం విద్యుత్ సంస్థలు నేషనల్ హైవేలో పెట్రోలియం కంపెనీలు విమానయానం స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ గోదాములు ప్రభుత్వ భూములు లాంటి అనేక రంగాలను పెట్టుబడుదారులకు తాకట్టు పెడుతున్నారని అన్నారు. విద్యార్థుల మనసులో విష బీజాలు నాటే విధంగా పాఠ్యపుస్తకాల్లో అశాస్త్రీయతను చెప్పిస్తూ కాషాయీకరణ చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బిజెపి చేసే కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి, జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, నాయకులు కిష్టయ్య, కనకయ్య, రాజు, కిరణ్, శంకర్, బాల నరసయ్య, రఘుపతిరెడ్డి, భూపతిరెడ్డి, శ్రీనివాస్, చంద్రకళ, లావణ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం

- పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వ విధానాలపై పోరాటం మరింత ఉధృతం చేస్తామని పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలో రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వ ధనం లూటీ చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులకు తెలంగాణ ప్రభుత్వం నిధులు పెంచుకొని ప్రాజెక్టులు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాల్లో కరెంటు కోతలు, వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు గోన సంచులు ఇవ్వడం లేదన్నారు. రైస్ మిల్లులు రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుకు అన్నిట్లో మోసం జరుగుతుందన్నారు. పంట నష్టాన్ని అధికారులు ఇప్పటివరకు అంచనా వేయలేకపోయారన్నారు. జిల్లాలో భారీగా నష్టపోయినట్లు ఆయన చెప్పారు. గజ్వేల్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మూడు నాలుగు సంవత్సరాలుగా ఒక కిలోమీటర్ రోడ్డు కోట మైసమ్మ రోడ్డును అధికారులు, పాలకులు చేయలేకపోతున్నారని ఆయన మండిపడ్డారు. కోట మైసమ్మ రోడ్డు విషయంలో ఇండ్లు కోల్పోతున్న వారందరూ ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరికి కుటుంబంలో డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పీర్ల మసీదు నిర్మాణ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో పీర్ల మసీదు నిర్మాణ పనులకు గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో గురువారం శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న పీరీల మసీద్ శిథిలావస్థకు చేరడంతో స్థానిక సర్పంచ్ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఎఫ్సీ నిధులు నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. నూతన మసీదు నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో నిర్మాణ పనులు ప్రారంభం చేశారు, ఈ కార్యక్రమంలో సొసైటి చైర్మన్ కోల రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు చౌడుచెర్ల జయపాల్ రెడ్డి, నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ కోల మహేందర్ గౌడ్, మండల కో అప్షన్ సభ్యులు రహీం పాషా, సిద్దన్న పేట ఎంపీటీసీ బెదురు తిరుపతి, బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి తుమ్మ కోలు మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు గాడిపల్లి రాజేందర్ రెడ్డి,నాయకులు ఉల్లి చిన్న మల్లయ్య, దేవులపల్లి కనకయ్య, ఆకుబత్తిన రాము, అరె శ్రీనివాస్, పీరీల ఉత్సవ కమిటీ సభ్యులు అప్పీసు నర్సింలు,శేఖర్, మహేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పిడియాట్రిక్‌తో పాటు వివిధ విభాగాల్లో భర్తీ



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు 28 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, కృషితో సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని పాథాలజీ (1), మైక్రోబయోలజీ (1), కమ్యూనిటీ మెడిసిన్ (2), జనరల్ మెడిసిన్ (4), పిడియాట్రిక్ (3), డివిఎల్ (1), సైకియాట్రీ (1), రేడియాలజీ (1), జనరల్ సర్జరీ (4), ఆర్థోపెడిక్ (2), ఈఎన్‌టీ (1), గైనకాలజీ (4), అనస్థీషియా (3) తో పాటు మొత్తం 28 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

ప్రజా వైద్యరంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నది. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు సర్కారు దవాఖానలను బలోపేతం చేస్తున్నది. మరోవైపు జిల్లాకో మెడికల్ కళాశాలను తీసుకొచ్చి వైద్య విద్యను చేరువ చేసింది. జిల్లాకు 28 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు ఉత్తర్వులు ఇవ్వడంపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.



- ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట్ మండలం కేశవాపూర్‌లో ఇటీవల మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్తినేని నరేందర్ రావు కుటుంబ సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉస కోయిల రాఘవులు, అక్కన్న పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి అయిలయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి అయిలయ్య, హుస్నాబాద్ టౌన్ కౌన్సిలర్ వల్లపు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీకట్ల రాజయ్య, చిట్టంపల్లి అయిలయ్య, ఎర్రోజు రమణా చారి, రేపాక సంపత్ రెడ్డి, తలపాక కొమురయ్య, మంద రాజేశం, మునిగే రాజు, చెన్న బోయిన వీరన్న, మంద రవి, బత్తిని బాబయ్య, మహేష్, సత్యం, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిగింజనూ కొనుగోలు చేయాలి

- మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



నవతెలంగాణ- గజ్వేల్

రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలంలో పలుచోట్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంబంధిత శాఖ సిబ్బందికి సూచించారు. రైతులు అసలే నష్టపోయి ఉన్నారని ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక దృష్టితో చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించుకున్నామని వాటి ద్వారా కొనుగోలు కార్యక్రమం కొనసాగుతుందని ఆయన చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా అధికార సిబ్బంది సహకరించాలని ఆయన సూచించారు. గోన సంచులు లేని చోట వెంటనే తెప్పించాలని రైస్ మిల్లర్స్ పూర్తిస్థాయిలో రైతులకు సాయం చేయాలని ఆయన కోరారు. రైతు వడగళ్లతో నష్టపోయి ఉన్నారని మార్కెట్ తెచ్చిన వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహా సభకు తరలిన నాయకులు



నవతెలంగాణ-తొగుట

మండలం చందా పూర్ గ్రామం నుంచి అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఛలో ఇంద్ర పార్క్ ధర్నాకు తరలి వెళ్లారు. గురువారం మండలంలోని చందపూర్ గ్రామం యాదవ సంఘం సభ్యులు తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు, యాదవ సంఘం అధ్యక్షుడు నరిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పడల స్వామి, పడల కుమార్, ఏనుముల శ్రీనివాస్, ఆత్మకురి శ్రీకాంత్, బొడ్డు తిరుపతి, బొడ్డు స్వామి, బొడ్డు శ్రీకాంత్, నరిశెట్టి నవీన్, నర్సెట్టి రాజేశం తదితరులు ఉన్నారు.

విద్యా క్షేత్రంగా సిద్దిపేట నియోజకవర్గం

- గ్రామాల్లో బీఆర్ఎస్వీ ఆత్మీయ సమ్మేళనాలు



నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట నియోజకవర్గాన్ని విద్యా క్షేత్రంగా మార్చారని బీఆర్ఎస్వీ సిద్దిపేట నియోజకవర్గ సమన్వయ కర్త నార్లపురం రాంమోహన్, మండల పరిశీలకులు భూక్యా బిక్షపతి నాయక్ మండల అధ్యక్షులు గోవిందారం రవిలు అన్నారు. గురువారం సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలంలోని ముండ్రాయి, తిమ్మాయిపల్లి గ్రామాలలో మండల బిఆర్ఎస్వి అధ్యక్షులు గోవిందారం రవి అధ్యక్షతన బీఆర్ఎస్వీ విద్యార్థి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీ నుంచి ఎంబీబీఎస్, అగ్రికల్చర్, వెటర్నరీ, బి ఫార్మసి వంటి పెద్ద చదువులు చదివే చదువుల నిలయంగా సిద్దిపేట నియోజకవర్గంను తీర్చిదిద్దారని తెలిపారు. విద్యార్థి యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో నంగునూరు మండలంలో డీఎక్ష్ఎన్ కంపెనీ, ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ వంటి వాటిని నెలకొల్పి ఉపాధి కల్పిస్తున్నాడన్నారు. మంత్రి హరీశ్ రావు ఆధ్వర్యంలోనే అనేక కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తున్నాయని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముండ్రాయి సర్పంచ్ బెంద్రం కమలాకర్ రెడ్డి, తిమ్మాయిపల్లి సర్పంచ్ ఏల లత కృష్ణ, మాజీ సర్పంచ్ మల్యాల నర్సింలు,కలకుంట్ల నర్సింలు, వెంకటేశం,గుండెల్లి రాజయ్య,చేర్యాల రాజు పాల్గొన్నారు.ఆయా గ్రామాల ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో ముండ్రాయి బీఆర్ఎస్వీ గ్రామ శాఖ అధ్యక్షులుగా బొంగు శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా సంపత్, ప్రధాన కార్యదర్శిగా సోహెల్ 18 మందితో పూర్తి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా తిమ్మాయిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా మల్యాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా చేర్యాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పి. సాయి కుమార్,18 మందితో పూర్తి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి పావురాల అశోక్, మండల ఉపాధ్యక్షులు అప్పాల శేఖర్ యాదవ్,చల్లారం మహేందర్ రెడ్డి, సోషల్ మీడియా ఆకారం రాజేందర్,మల్యాల నరేష్ యాదవ్, తెలు రఘు,కృష్ణ,రాజు,యాకోబ్ రెడ్డి, చరణ్,జగన్, నరేష్,కొలిపాక బాబు,కె. రాజు,ఎ. రాజు, రాజశేఖరరెడ్డి, సాయి, ప్రవీణ్, రాజేందర్, శ్రీకాంత్, రాకేష్, ప్రణయ్, వెంకటేష్, మల్యాల రవి, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 4న దళితుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-దుబ్బాక

అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఎస్ బిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 30న జరగాల్సిన దళితుల ఆత్మీయ సమ్మేళనం అనివార్య కారణాల వల్ల జూన్ 4 న నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళన కమిటీ చైర్మన్ ఆస యాదగిరి తెలిపారు. ఈ సమ్మేళనానికి రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, మెదక్ ఎంపీ, బిఆర్ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డిలు ముఖ్యాతిథులుగా హాజరవుతున్నారని వెల్లడించారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో మెదక్ ఎంపీ ని కలిసి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎస్సి,ఎస్టీ ప్రజా ప్రతినిధులు,తాజా మాజీలు, నామినేటెడ్, పార్టీ క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.కరికె శ్రీనివాస్, ర్యాకం శ్రీరాములు, వనం రమేష్, దుబ్బరాజం, బిఆర్ఎస్ అక్బర్ పేట భూంపల్లి మండలాధ్యక్షుడు జీడిపల్లి రవి, ముక్కపల్లి శ్రీనివాస్ పలువురున్నారు.

జనవిజ్ఞాన వేదిక ఉచిత వేసవి శిక్షణ

- శిబిరంకు ఆదరణ

నవతెలంగాణ-సిద్దిపేట

వేసవి సెలవులలో విద్యార్థులకు సృజనత్మాకతను, శాస్త్రీయ దృక్పదాన్ని, పెంపొందింపచేయడానికి, వారు ఉత్సాహంగా ఉండడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వారు నిర్వహిస్తున్న శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. ఈ నెల 22 నుంచి 27 వరకు స్థానిక ఇందిరా నగర్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ శిక్షణ శిబిరంలో నేర్పిస్తున్న అంశాలను శాస్త్రీయ దృక్పథంతో నేర్చుకుంటున్నారు.

నేర్పిస్తున్న అంశాలు

జన విజ్ఞాన వేదిక తన సంస్థ ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలలో, విద్యార్థుల్లో పెంపొందించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వేసవి కాల సెలవులను ఉపయుక్తంగా చేసుకోవడం కోసం విద్యార్థులకు సృజనత్మాకతను, శాస్త్రీయ దృక్పదాన్ని పెంపొందింపచేయడానికి మొదటి రెండు రోజులు ఒరిగామి, మూడవరోజు లోకస్ట్ నోకాస్ట్ పాఠ్య పుస్తక ప్రయోగాలు, నాలుగవరోజు మేజిక్, ఐదవరోజు డ్రాయింగ్, బయాలజీ ప్రయోగాలు, ఆరవ రోజు భౌతిక రసాయన శాస్త్ర ప్రయోగాలు విద్యార్థులకు నేర్పించనున్నారు.

శిక్షణ ఎంతో ఉపయోగకరం

మొలుగు బాలరాజు , జేవివి జిల్లా అధ్యక్షులు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. విద్యార్థుల సృజనాత్మకత శక్తిని పెంచే విధంగా కార్యక్రమాలు ఉన్నాయి. మూఢనమ్మకాలను కాకుండా శాస్త్రీయ పదాన్ని నమ్మే విధంగా మ్యాజిక్ షోలు నిర్వహించాం. విద్యాశాఖ అధికారుల సహకారం ఉంది.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లం రాజు, ఎంపీటీసీ గొడుగు జ్యోతి స్వామి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి వంగ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ మెడికల్‌లో 'విశ్వతేజ' విద్యార్థికి 1248 ర్యాంకు



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో గత 31 సంవత్సరాలుగా ఇంటర్మీడియట్ విద్యలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన ఫలితాలు సాధించడంతో పాటు ఎంసెట్, నీట్, జెఇఇ మెయిన్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ మెరుగైన ర్యాంక్‌లు సాధిస్తున్నామని విశ్వతేజ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శౌర్య, ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. గురువారం ఎంసెట్ ఫలితాలు రావడంతో వారు మాట్లాడుతూ 2023 ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులతో పాటు ఎంసెట్-2023 మెడికల్ కళాశాలకు చెందిన కురుమ వర్షిత 1248 ర్యాంక్‌తో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా వర్షిత మాట్లాడుతూ భవిష్యత్తులో వెటర్నరీ డాక్టర్ గా సేవలందించాలనుకుంటున్నానని,ఈ ర్యాంక్ రావడానికి సహకరించిన అధ్యాపకులకు, తలిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు..ఈ ర్యాంకుతో పాటు కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల కరస్పాండెంట్ శౌరయ్య, ప్రిన్సిపాల్ కొడారి రాజు,అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను బూత్ స్థాయిలో ప్రచారం చేయాలి

- బీజేపీ సిద్ధిపేట జిల్లా ఇంఛార్జి అంజన్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

కేంద్ర ప్రభుత్వ పథకాలను బూతు స్థాయిలో ప్రచారం చేయాలని బీజేపీ సిద్ధిపేట జిల్లా ఇన్‌చార్జి అంజన్ కుమార్ గౌడ్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో సిద్ధిపేట జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నెల మే 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా ఇంఛార్జి గంగిడి మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బురుగు సురేష్, నరేష్, రోశయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి



నవతెలంగాణ-కొండపాక

దేవాలయంలో చోరీకి యత్నించిన దొంగకు దేహశుద్ధి చేసిన ఘటన మండల కేంద్రమైన కొండపాకలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొడకండ్ల గ్రామానికి చెందిన అంజి చారి గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో చోరీకి యత్నించి గుడి గంటలను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసి కుకునూరు పల్లి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజు తెలిపారు.

కుర్కురే కొనాలట!



నవతెలంగాణ-మిరు దొడ్డి

రెక్క ఆడితే గాని డొక్కాడని పరిస్థితి రాత్రింబవళ్లు మహిళలు బీడీలు చుడుతూ వారి కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోని పలు గ్రామాల్లోని బీడీ తయారీ కార్ఖానాల్లో 'కుర్ కురే' ప్యాకెట్లను కార్మికులకు బలవంతంగా అంటగడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. మిరుదొడ్డి మండలం బీడీ కార్మికులు మద్దెల ప్రవీణ్ మాట్లాడుతూ అవసరం లేకున్నా కచ్చితంగా తీసుకోవాలని షరతులు విధిస్తున్నారని కార్మికులు వాపోతున్నారన్నారు. తమకు వచ్చే అరకొర జీతంలో ఈ ప్యాకెట్లకే రూ.300 - రూ. 400 చెల్లించాల్సి వస్తోందని వారు పోతున్నారు. ఈ వింత పోకడలను చూసి పలువురు ముక్కున వేలేసుకుంటున్నారట.

పచ్చదనంతో కనువిందు





- పట్టణ ప్రజలకు పసందు

నవతెలంగాణ- గజ్వేల్

అడుగు పెట్టగానే పచ్చదనంతో కనువిందు చేసేలా ఆహ్లాదయకర వాతావరణం. ఒకసారి అందులోకి వెళ్లిన చిన్నారులు, పెద్దలను మంత్రముగ్ధులను చేసేలా నయా లుక్కుతో రూపుదిద్దుకుంటున్న గజ్వేల్ రాజీవ్ పార్క్ త్వరలోనే పట్టణ వాసులకు అందుబాటులోకి రానున్నది. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావు కృషితో రూ 1.25 కోట్లతో పార్కు అద్భుతంగా కొత్త కలను సంతరించుకుంది. త్వరలోనే ఈ పార్కు అందుబాటులోకి తీసుకొస్తే చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఉంటుంది. పెద్దలకు సేద తీర్చుకునేలా అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. చిన్నారుల కోసం ఆట వస్తువులు, పచ్చని గ్రాస్ తో మైదానం, వేడుకలు నిర్వహించుకునేందుకు స్టేజి ఆకట్టుకునేలా ఉంది. స్టేజిపై బొమ్మలు అద్భుతంగా తీర్చిదిద్దారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న పార్కును త్వరలోనే పట్టణ వాసులకు అందుబాటులో తీసుకొచ్చేందుకు అధికారులు పనుల్లో వేగం పెంచారు.



పార్కు పునరుద్ధరణ

గజ్వేల్ పట్టణంలో రాజిరెడ్డిపల్లి కుంట సమీపంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మంత్రిగా పనిచేసిన డాక్టర్ గీతారెడ్డి తన జన్మదిన సందర్భంగా ఈ పార్కుకు ఏర్పాటు చేశారు. 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నుండి గెలవడంతో గజ్వేల్ పట్టణ ప్రజలకు మంచి పార్కును మరిన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో పాత పార్కును పూర్తిస్థాయిలో తొలగించి రూ 1.25 కోట్ల రూపాయల నిధులతో పార్కును పునరుద్ధరించారు. ప్రస్తుతం కొత్త కళను తీసుకొచ్చేలా అధికారులు పార్కు తయారు చేశారు. అంతే కాకుండా వాకింగ్ ట్రాకులను ఏర్పాటు చేశారు. పిల్లల కోసం జంతువుల బొమ్మలు సేద తీర్చుకునేందుకు బల్లలు ఏర్పాటు చేయగా అవి అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. త్వరలోనే ఈ పార్కును మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

సీఎం కృషితో..



ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి తో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. గజ్వేల్ పట్టణ ప్రజల తరపున ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కు రుణపడి ఉంటాను. అభివృ ద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గజ్వేల్ పట్టణం కోట్లాది రూపా యలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తాం



ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల కృషితో పార్కును అందుబాటులో తీసుకొస్తాను. మంత్రి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభిస్తాం. రాజిరెడ్డిపల్లి, అయ్యప్ప నగర్ ప్రజలకు కాకుండా గజ్వేల్ ప్రజలకు అందరికీ పార్కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా రాజిరెడ్డిపల్లి చెరువును సీసీ రోడ్లతో ముస్తాబ్ చేశామన్నారు.

- కౌన్సిలర్ బాలమణి శ్రీనివాస్ రెడ్డి

అందరికీ ప్రయోజనం



గజ్వేల్ పట్టణంలో రూపుదిద్దుకుంటున్న రాజీవ్ పార్కు అందరికీ ప్రయోజనం గా ఉంది. పిల్లలకు, పెద్దలకు కావలసిన బల్లలు వస్తువులు ఆట బొమ్మలు ఏర్పాటు చేశారు. పార్కు సుందరీకరణ పూర్తయింది. వాకింగ్ దారులకు మరింత ఉపయోగా ఉంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల తిరిగి రాజీవ్ పార్క్ ను పునరుద్ధరణ సాధ్యమైంది.

- కౌన్సిలర్ అల్వాల బాలేష్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన నాయకులు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు పరిస్థితిని బిజెపి కిసాన్ మోర్చా బిజెపి నాయకులు మర్కంటి ఏగొండ గురువారం రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 రోజుల నుండి రైతులు మార్కెట్లో ధాన్యాన్ని కుప్పలుగా పోసి దానిని సేకరించకుండా మూడు రోజులకు ఒకసారి ట్రక్ లో లోడ్ అవుతున్నాయని చెప్పారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్ష సూచనలు ఉన్నందున అధికారులు ఎక్కువ మొత్తంలో బార్దాన్ ట్రక్కులను, బాయిలర్ రైస్ మిల్లును ప్రత్యామ్నాయ గోదాముల ఏర్పాటు చేసి కొనుగోలు అయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు మైస విజయ్ గజ్వేల్ పట్టణ మహిళ అధ్యక్షురాలు కుంకుమ రాణి, గజ్వేల్ బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి కాశమైన నవీన్ (ఢిల్లీ) గజ్వేల్ దళిత మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి గడ్డమీది ప్రశాంత్ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర కనీస వేతనాల మండల సభ్యులుగా మంచె నర్సింలు



నవతెలంగాణ - సిద్ధిపేట

తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మండలి సభ్యులుగా తనను నియమించినందుకు మంత్రి హరీష్‌రావుకు పట్టణానికి చెందిన మంచె నర్సింలు ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్, రాష్ట్ర కార్యవర్గానికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. 20 సంవత్సరాలుగా కార్మిక నాయకునిగా, హరీశ్ రావు సూచనలు, సలహాలతో, పట్టణంలో ఉన్న పెద్దల సూచనలు సలహాలతో సంఘాన్ని ముందుకు తీసుకుపోతూ, కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేస్తూ. అన్ని రంగాల కార్మికులకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకో వడం జరుగుతుందని తెలిపారు.

సీఎం కప్ సిద్దిపేట జిల్లా స్థాయి ఖోఖో గేమ్‌లో గజ్వేల్ ద్వితీయ స్థానం



నవతెలంగాణ- గజ్వేల్

ఈ నెల 22, 23, 24వ తేదీలలో సిద్ధిపేటలో జరిగిన సీఎం కప్ ఖోఖో పోటీలు ఫైనల్‌లో పురుషుల విభాగంలో గజ్వేల్ మండలం జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న గజ్వేల్ మండలం జట్టును ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్ రావు, సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంతి జీవన్ పాటిల్ అభి నందించారు, ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండలం ఎంపీడీవో. మచ్చేందర్ , గజ్వేల్ గేమ్స్ ఇన్చార్జి సీనియర్ పిఈటి.రాజిరెడ్డి, పిడి.భవాని, .విజయరేఖ, .నగేష్, .గోవర్ధన్ రెడ్డి , .నరేష్ కుమార్ పాల్గొన్నారు.


పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని వర్ధరాజ్‌పూర్ గ్రామంలో పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించనున్నట్లు సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు అప్పాల ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని వర్ధరాజ్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎఫ్డీఎఫ్ నిధుల నుంచి అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.70 లక్షలతో భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చంద్రయ్య, పీఆర్ ఏఈ బాషా, నాయకులు ఎల్లయ్య, కనకయ్య, అంజనేయులు, తదితరులున్నారు.

దుబ్బాక జెడ్పీటీసీకి పలువురి పరామర్శ



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

దుబ్బాక జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి తల్లి రాజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, ఎంపీడీవో భాస్కర శర్మ, ఎంఈఓ జోగు ప్రభుదాస్, గుర్రాల శ్రీనివాస్ గురువారం జెడ్పీటీసీ స్వగ్రామమైన తిమ్మాపూర్‌లో వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ధాన్యం దిగుమతిలో జాప్యం చేయొద్దు

రైస్ మిల్లులను సందర్శించిన పౌరసరఫరాల చైర్మన్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యం దిగుమతిలో జాప్యం చేయొద్దని పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ అన్నారు. గురువారం హుస్నాబాద్ మండలంలోని రైస్ మిల్లులను సందర్శించారు. రైసు మిల్లు లలో ధాన్యం దిగుమతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో వేగం పెంచాల చూడాలని, వెను వెం టనే రైస్ మిల్లులకు తరలించేల చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫ రాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ హరీష్ ల కుసూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న అన్ని రకాల వైద్య సేవలు సదు పాయాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కోమల్ విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రమైన జిన్నారం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో మేలైన వైద్య సదుపాయాలు ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందన్నారు. ఈ సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆసుపత్రిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీబీ పరీక్షల శిబిరం లో భాగంగా ఎక్స్ రే క్యాంపు 60 పరీక్షలు, స్ఫుటో మి12 పరీక్షలు, ఒక ట్రీట్మె ంట్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ప్రాథమి ఎక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఉపకేంద్రాల బృందం సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ సంగారెడ్డి పట్టణ కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



బీజేపీ పట్టణ అధ్యక్షులు ప్రసాది రవిశంకర్ అధ్యక్షతన పట్టణంలోని జనప్రియ హెూటల్లో బీజేపీ సంగారెడ్డి పట్టణ కార్యవర్గ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్ హాజరై మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ఏర్పడి ఈనెల 30 నాటికి 9 ఏండ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా.. మే 30 నుంచి జూన్ 30 వరకు అన్ని జిల్లా, మండల, శక్తి కేంద్ర, బూత్‌లలో చేపట్టనున్న మహా జన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, అసెంబ్లీ కోకోనూర్ సత్యనారాయణ, కౌన్సిలర్స్ మందుల నాగరాజు, కసిని వాసు, నాకోటి రమేష్, అశ్వంత్, పట్టణ ప్రధాన కార్యదర్శి విక్రమ్ శంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



పోచమ్మ గుడికి ఎంపీపీ సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని పెద్దమ్మగూడెం గ్రామంలో గల గాలి పోచమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం తనవంతు సాయంగా జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్ రూ.10వేలను అందజేశారు. ఆయన నిర్మాణానికి చేయూతనివ్వాలని అడగగానే.. ఆయన వెంటనే స్పందించి సాయం చేశారు. పోచమ్మ దేవాలయ నిర్మాణానికి ఆర్థికపరమైన చేయూతను అందిస్తూనే అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సోలక్ పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, గొర్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు అనంతగిరి, మల్లేష్, పెద్దమ్మ గూడెం గ్రామ యువకులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ దొందూదొందే

- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయమే లక్ష్యంగా ముందుకు సాగుదాం
- ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి
- ఇందుప్రియాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-దౌల్తాబాద్

వచ్చే సాధారణ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించేలా కృషి చేద్దామని సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన దౌల్తాబాద్ మండలంలోని తొమ్మిది గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ దుబ్బాక నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చి అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రతి పనిని తానే చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనడానికి నిరాకరించినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. ఉప ఎన్నికల్లో జరిగిన చిన్న చిన్న సమస్యలను అధిగమించి పార్టీ గెలుపునకు సమిష్టిగా కృషి చేద్దామని, ప్రతి కార్యకర్తకు తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. త్వరలోనే పిల్ల కాలువలను పూర్తిచేసి ఈ ప్రాంతంలోని చెరువులను కాళేశ్వరం నీటి ద్వారా నింపుతామని స్పష్టం చేశారు. బిజెపి కాంగ్రెస్ పార్టీ లు దొందు దొందే అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే దివంగత సోలిపేట రామలింగారెడ్డి తనయుడు సతీష్ రెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మనోహర్‌రావు, ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్‌రెడ్డి, ఎంపీపీ సంధ్య, జడ్పీటీసీ రణం జ్యోతి ఎంపీటీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, చిట్కుల స్వామి, నాగరాజు గౌడ్, మంజూర్, గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు గ్రామస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



నవతెలంగాణ-మర్కుక్

ముదిరాజులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, విద్యా ఉద్యోగాల్లో ముందుకు పోవాలంటే ముదిరాజు మహిళలను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముదిరాజ్ మహాసభ మహిళా రాష్ట్ర అధ్యక్షులు మందుల వరలక్ష్మి ముదిరాజ్ అన్నారు. మర్కుక్‌లోని ముదిరాజ్ భవనంలో మర్కుక్ ముదిరాజ్ మహిళ మండలాధ్యక్షురాలు లింగ శ్రీలత అధ్యక్షతన మహిళల సమావేశం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేశామన్నారు. ఆ స్థాయిలో ముదిరాజులకు అవకాశాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు కుటుంబంలో ఎంతో బిజీగా ఉన్నా పిల్లల పనులు, కుటుంబం పనులు చేసుకుంటూ విద్యా ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రాణించడం గొప్పవిషయమన్నారు. మునుముందు ముదిరాజులకు రాజకీయంగా అవకాశాలు ఇవ్వాలన్నారు. వర్గల్ మండల అధ్యక్షలు శ్రీరామ్ నర్సింలు ముదిరాజ్, ప్రజ్ఞా పూర్ టౌన్ అధ్యక్షులు శ్రీను ముదిరాజ్,పాతుర్ కుమార్ ముదిరాజ్ ,కుంట సత్యం ముదిరాజ్, మహిళలు ,తదితరులున్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

ప్రజ్ఞాపూర్ : ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం ఆహ్వానం మేరకు ముదిరాజ్ మహాసభ మహిళా రాష్ట్ర అధ్యక్షులు మందుల వరలక్ష్మి ముదిరాజ్ గురువారం ప్రజ్ఞాపూర్‌కు వచ్చారు. అనంతరం ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రొట్టెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం ఇప్పుడిప్పుడే బలపడుతోందన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు, రాజ్యసభ ఎంపీ బండ ప్రకాష్ ఆదేశాలతో నియోజకవర్గాల్లో సంచరించడం జరుగుతుందన్నారు. ముదిరాజ్ సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు మహిళలకు ఆమె తెలిపారు. ముదిరాజ్ కుల వృత్తులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. నాయకులు బెదిరమైన మల్లేశం ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేశం, మల్లేశం బెదంమైన భిక్షపతి, ఎల్లా బాలమణి, శ్రీరామ్ పెంటమ్మ ,బోయిని మల్లమ్మ, పుష్ప, సురవ్వ, సులోచన పాల్గొన్నారు.

పేదలకు వరం కంటి వెలుగు

నవతెలంగాణ-వట్‌పల్లి



పేద ప్రజలకు కంటివెలుగు వరం లాంటిదని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు నరసింహులు అన్నారు. మండలంలోని దేవనూరు గ్రామంలో ఎంపీడీవో జగదీశ్వర్‌తో కలసి కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతిని కాంక్షించి కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో చేపట్టారన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యూసుబ్, సర్పంచ్, కంటి వెలుగు సిబ్బంది, అప్తాల్మిక్ డాటా ఆపరేటర్, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లుపాల్గొన్నారు.

నూతన మిఠాయి బండార్ ప్రారంభోత్సవంలో అనిల్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఐడిఎబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలో హీరాలాల్ నూతనంగా ఏర్పాటు చేసిన బికనెర్ మిఠాయి వాలా బండార్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా స్వీట్ హౌస్ నిర్వాహకులు ఆయన్ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. 'స్వీట్ హౌస్ నిర్వాహకులకు నా శుభాభినందనలు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లారం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు కాటారం శ్రీనివాస్ ,మార్వాడీ సోదర సోదరీమణులు మరియు బొల్లారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



యోగాతో ఆరోగ్యం

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రతిరోజు జీవితంలో యోగ భాగంగా మారిపోవాలని జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ వెరైటీ రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ , వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం బాలలకు ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసంతో పాటు ఏకాగ్రత, విశ్వాసం, ఆరోగ్యం యోగాతో సమకూరుతాయని చెప్పారు. బాల్యంలోనే యోగాను స్వీకరించడం, సాధన చేయడం ద్వారా ఉన్నతమైన భవిష్యత్తుకు బాటలు పడతాయన్నారు. ఎక్కడ ఆరోగ్యం ఉంటుందో అక్కడ అన్ని రంగాలు వికసిస్తాయన్నారు. టీఆంఎస్ రాష్ట్ర నాయకులు వేలేటి రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం యోగ విద్యను అన్ని విద్యాసంస్థల్లో క్రమంగా ప్రవేశం పెడుతుం ది అని చెప్పారు. 27 వార్డ్ కౌన్సిలర్ నాగరాజు రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా సాధనను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అంజయ్య, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర యోగ అధ్య యన పరిషత్ సభ్యులు, తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ యోగశిక్షకులు తోట సతీష్, సంధ్య , యోగ సభ్యులు పూజ, మనీషా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అంధత్వ నివారణకు కంటి వెలుగు

నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో రెండవ విడత కంటివె లుగు కార్యక్రమాన్ని సర్పంచ్ తోట భాగ్యలక్ష్మి ఆంజనేయులుతో కలిసి గురువారం ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ అంధత్వ నియంత్రణకు కంటి వెలుగు కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని, పేదల కుటుంబాలలో వెలుగులు నింపుతుం దన్నారు. అలాగే ముఖ్యమంత్రి కెసీఆర్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కంటివెలుగును ప్రారంభించినట్లు తెలిపారు. కార్పోరేట్ స్థాయిలో అందించే కంటి పరీక్షలను ఉచితంగా అందరికి అందేందుకు మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ల సహకారం ఎంతగానో ఉందన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో ఇప్పటి వరకు మండలంలో 23 వేల 688 మంది కంటి వెలుగు కార్యక్రమంలో కంటి పరీక్షలు చేసుకోవడంతో నాలుగు వేల 442 మందికి కళ్ళజోడులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ జావీద్ అహ్మద్, ఉపసర్పంచ్ హనుమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు కంది శ్రీనివాస్‌రెడ్డి, భీమ్‌రెడ్డి భారతమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, డాక్టర్‌లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.